


# ముళ్లకంచెలు

చలపతిరావు వుత్తరాన్ని కళ్ల కద్దుకున్నాడు. చుట్టూ కలయచూశాడు. అంత చిన్న తెల్ల కాయితంలో వున్న నాలుగే నాలుగు పంక్తులూ, కిందవున్న 'మీ–కనకాంబ' అన్న పొట్టి గుండ్రని సంతకం, తన భావిజీవితాన్ని వెలుగ్గా, తరగని ఆనందంగా మార్చబోతూ వుందని – లోకానికి – కనీసం ఆ వుత్తరం తెచ్చిన పోస్టు జవానుకు మాత్రం ఏం తెలుసు!

జేబు రుమాలుతో మొహం ఓమారు తుడుచుకుని, చుట్టూ మళ్లీ కలయచూసి, చలపతిరావు తిరిగి వుత్తరాన్ని కవరులో నుంచి బయటకు లాగి చదవసాగాడు.

నాలుగే నాలుగు పంక్తులు. కింద పొట్టి, గుండ్రని సంతకం. చదవడం ఎంతసేపు పడుతుంది!

కైపెక్కించే కమ్మని తలపుల్తో, వుప్పొంగే వుత్సాహంతో అతడు వుత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకుని, దొడ్డి వాకిలి తెరిచాడు.

కిర్రుమంటూ తెరుచుకున్న తలుపుల శబ్దానికి, బెదురుగా చూసి, చెవుల్ని నిక్కపొడిచి – అంతలో సర్దుకుని కాలు దువ్వుతూ, పెద్దగా రంకె వేసింది కోడెగిత్త.

"రెండు రోజుల్లో కాడి కలుపుతారు. మదం అణుగుతుంది!"

చలపతిరావు సూటిగా గిత్త వంక చూస్తూ అనేశాడు. ఆ వుత్సాహంలో, మైమరపిస్తూన్న ఆనందంలో అతడికి, ఆ మాటల్ని ఆ నాలుగు కాళ్ల జీవి అర్థం చేసుకోలేదని కూడా తెలీలేదు.

మోర ఎగబట్టి, సిగమారు తాడును గుంజుతూ, కట్టుగొయ్యి చుట్టూ కలయ తిరిగే గిత్తను సమీపించి, ఆప్యాయంగా వెన్ను మీద చేయివేసి నిమిరాడు.

అది ఓ క్షణకాలం తల వంచుకు వూరుకుని, తిరిగి తాడును గుంజుతూ, మళ్లీ రంకె వేసింది.

"ఏమిటీ సంగతి?" – చలపతిరావు ప్రశ్నించాడు. తల తిప్పి, ముళ్లకంచెకు అవతల వామి పక్కన మేస్తూవున్న పశువుల వంక చూశాడు.

ఓ ఆవు పెయ్య – పసుపుకొమ్ము ప్రమాణంలో వున్న తన చిట్టి కొమ్ముల్తో కంచెను పొడుస్తూ, కాళ్లతో చిమ్ముతూ, మధ్యమధ్య గిత్త వంక చూస్తూ – చర్నాకోలులా అన్ని వైపులకూ తిప్పుతూన్న తోకతో, రిక్కించిన చెవుల్తో, నీలంగా – పిచ్చిగా తిరుగుతూన్న కళ్లతో కంచె దూకేందుకు ప్రయత్నిస్తోంది.

"అదా! బలే!" – గట్టిగా ఓమారు వెన్ను మీద చరిచి, సిగమారు తాడు వూడదీశాడు చలపతిరావు.

గిత్త తోకను ఒక్కసారి గాలిలోకి తిప్పి, ఒక్క చెంగున ముళ్లకంచె దూకేసింది.

"దేనికైనా మగజీవే సాహసించాలి! ఆడప్రాణిదల్లా – ఆదో రకం బడితె విరగని బేరం...."

గట్టిగా చప్పట్లు చరుస్తూ, అక్కడే ఎండుగడ్డి మోపు మీద కూలబడ్డాడు చలపతిరావు.

పడమటి వైపున ఆకాశం ఎర్రని చారలు పూసుకుంటోంది. ఎత్తుగా ఓ చిలవల గుంపు బారులు తీర్చి ఎగిరి పోతోంది.

చలపతిరావు వెల్లికిలా ఎండుగడ్డి మీద పడుకుని అప్పటికే కంఠస్థమైన వుత్తరంలోని వాక్యాల్ని మననం చేస్తున్నాడు.

వుత్తరంలోని ప్రతి వాక్యం, అక్షరం కూడా అతడికి వింతగా, ఆశ్చర్యంగా కనబడినై. ఎంతో కాలంగా వుత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూన్న దానిలా – కనకాంబ నాలుగు పంక్తుల్లో సమస్యను తేల్చేసింది.

'వారం రోజుల లోపల ఓ మారు రండి. మా నాన్న అంగీకరించాడు. వివాహం....ఆ తేదీ..... ఆ నిర్ణయం....అంతా మీది......'

చలపతిరావుకు ఆలోచించిన కొద్దీ ఆశ్చర్యం యినుమడించసాగింది. వెల్లివిరుస్తూ ముందుకు తోసుకువచ్చే వుత్సాహాన్ని, ఆనందాన్నీ క్రమంగా అనుమానం, సంశయం వెనక్కి నెట్టసాగినై.

చిన్నప్పుడు – బహుశా తన పన్నెండో ఏట కావొచ్చు – యిప్పటికి ఎనిమిదేళ్ల కిందట తను ఆఖరిసారిగా కనకాంబను చూశాడు. సవారి కట్టిన రెండెడ్ల బండిలో తల్లి పక్కన కూర్చుని, బండి వూరు దాటి చింతల రోడ్డు ఎక్కబోయేప్పుడు – అదోలా చేయి వూపింది. అంతే!

ఆ తరవాత తిరిగివస్తూ తనూ, అన్న చలపతిరావూ ఎంత తీవ్రంగా దెబ్బలాడారు! ఆరునెల్లనాడు బండి బోల్తాపడి దొలుపులో చిక్కుకుని హఠాత్తుగా అతడు చచ్చిపోయేనాటి వరకూ, ఆనాటి దెబ్బలాట తనకు బాగా గుర్తుగానే వుండేది.

ఎక్కడో దూరాన, నైజాం ప్రాంతానికి కనకాంబ వాళ్ల కుటుంబం వలస పోయారనీ, తిరిగి యీ జన్మలో చూడగలగడం అసంభవమనీ, తను ఎంతగానో దిగులు పడ్డాడు.

కాని నాలుగేళ్ల కిందట కనకాంబ వాళ్ల తండ్రి తమ వూరు వచ్చినప్పుడు – మళ్ళీ తనలో ఆశ తల ఎత్తింది.

"మా అమ్మాయి చలపతిరావును మరిచిపోలేదు. చిన్న పిల్లలుగా, వీధిబళ్లల్లో అయ్యే స్నేహాలు – వాళ్లకు ఎంత గుర్తుగా వుంటయ్!" అన్నాడు కనకాంబ తండ్రి.

వాళ్ళ అమ్మ అడిగింది – "ఏ చలపతిరావు? మావాడా – మా బావగారి చలపతా?"

కనకాంబ వాళ్ళ తండ్రి తల గోక్కున్నాడు – తన వంకా, అన్న చలపతిరావు వంకా చూస్తూ, "పెద్ద చిక్కే వచ్చిందే! యిద్దరి పేర్లూ చలపతిరావులే!" – అన్నాడు.

"ఇద్దరూ గంట వారగానే పుట్టారు. మా వారికీ, మా బావగారిక్కూడా వారి తండ్రిగారి పేరే పెట్టుకోవాలని ఆపేక్ష. పేర్లే కాదు – మొహాలు కూడా..."

తన తల్లి, తల నిమురుతూ తన్ని దగ్గిరకు లాక్కుంది. అన్న చలపతి రావు అదోలా మొహంపెట్టి కనకాంబ తండ్రి మొహంలోకి చూస్తున్నాడు.

"నిజం! ఎరగని వాళ్ళయితే కవలపిల్లలనుకుంటారు. కాని మా అమ్మాయి గుర్తు చెప్పింది. చెప్పనా?"

కనకాంబ తండ్రి తన అన్న చేయి పట్టుకుని దగ్గరకు లాక్కున్నాడు.

"యిది! యీ మొహాన పెయ్యినాకుడు. అమ్మాయికి ఎంత గుర్తని! నిన్నేరా! అడిగానని చెప్పమంది"

తన నెత్తిన పిడుగు పడ్డట్టయింది. అన్న చలపతిరావు చేత్తో క్రాపు ముందు సుడిలా తిరిగిన పెయ్యినాకుడుని సవరించుకుంటూ హుషారుగా నవ్వుతున్నాడు. తను జ్ఞాపకం లేదా కనకాంబకి? ఆరోజు మొదలూ, అన్న చలపతిరావంటే తనలో ఎంత ద్వేషం కదుల్లాడేది!

చలపతిరావు నిట్టూరుస్తూ లేచి గడ్డిమోపు మీద కూర్చున్నాడు, బండి ప్రమాదంలో అంత ఘోరమైన చావు చచ్చినా – ఎందుకనో విచారంతో పాటు అతడంటే తనకి యింకా ద్వేషం ఒక మూల కదుల్లాడుతూనే వుండేది.

కాని యీ వుత్తరం...

చలపతిరావు జేబులో నుంచి వుత్తరాన్ని బయటికి లాగి, ముక్కు మీద రెండు చేతుల్తో దాన్ని అదుముకుని బలంగా గాలి పీల్చాడు.

'ఆరోజు – వాళ్ళ తండ్రి మతిమరుపులో పొరపాటు చెప్పాడు. కనకాంబ తననే అడిగానని చెప్పమని వుంటుంది. అన్న – ఆ పెయ్యినాకుడు చలపతిరావుని కాదు'

అతడికి అన్ని అనుమానాలూ, సంశయాలూ పటాపంచలైనట్టు తోచింది. సన్నగా, ఎర్రగా ఎంత అందంగా వుండేది కనకాంబ! ఆ కళ్లు ఎంతగా మెరుస్తూండేవి! నవ్వినప్పుడు....

చలపతిరావు తన బాల్యాన్నీ, వీధి బడి చదువునీ, కనకాంబకు తను చాటుమాటుగా, యింటి దగ్గిర నుంచి తెచ్చి పెట్టిన చిరుతిండ్లనీ.... అన్నిటినీ వూహించుకున్నాడు – అతని హృదయం మళ్లీ ఆనందంతో నిండుకొని తొణికిసలాడింది.

ఆ రాత్రి వద్దు వద్దు అనుకుంటూనే తల్లితో చెప్పేశాడు - తనకి కనకాంబ నించి వుత్తరం వచ్చిందనీ, చూడాలి రమ్మనమన్నదనీ.

"ఎందుకు రమ్మనమన్నది? నువ్వు యింకా గుర్తున్నావట్రా?" - తల్లి ఆశ్చర్యంగానే ప్రశ్నించింది.

"గుర్తులేకేం! బళ్లో మా యిద్దరికీ ఎంత స్నేహమని! వాళ్లు యీ వూరు వదిలి పోయేప్పుడు - వూరు దాటేవరకూ వెళ్ళివచ్చాను - అదోలా మొహం పెట్టి, నా వేపుకు చెయ్యి వూపింది"

తల్లి మాట్లాడకుండా వూరుకుంది.

కాసేపాగి చలపతిరావే అడిగాడు - "రెండు రోజుల్లో వాళ్ళ వూరు వెళ్తున్నాను. ఊఁ! వెళ్ళనా?"

"వద్దు నాయనా, వద్దు! ఏదో చిన్నపిల్ల ధోరణిగా రాసి వుంటుంది. అయినా పెళ్లీడు కొచ్చిన పిల్ల!"

తల్లి అనుమతి కోసం ప్రయత్నించడం వృథాప్రయాస అని చలపతిరావు గ్రహించాడు.

ఆ రాత్రి అతడికి నిద్రపట్టలేదు - అసలు నిద్రపోయేందుకు అతడు ప్రయత్నించలేదు కూడా.

జీవితానందాన్నీ, దాంపత్య సౌఖ్యాన్నీ గురించి కథల్లో, సినిమాల్లో అతడు చదివిన, చూసిన అనేక సంఘటనలు - అతడి తల నిండుగా కదుల్లాడినై. కనకాంబ అందమైందే! అది తనకు తెలుసు. ఏదో కొంత దూరపు బంధువు కూడా. అన్నిటికన్న - వీధి బడిలో కలిసిన ఆ బాల్యస్నేహాన్నుంచి, యీనాటి వరకూ తను ఆమెను మరిచిపోలేదు. ఈ రాసిన వుత్తరంతో తననీ కనకాంబ మర్చిపోలేదని తెలిసిపోయింది.. కాని... ఆ రాసిన వుత్తరం ధోరణీ, అంత ఖచ్చితంగా - సూటిగా ఆమె వెలిబుచ్చిన అభిప్రాయాలూ, చలపతిరావుకు, ఆలోచించిన కొద్దీ, ఏవో అనుమానాలని కలిగిస్తూనే వున్నవి.

అవసరం అనుకున్న కొద్ది గుడ్డల్నీ, డబ్బునీ తీసుకుని - తెల్లవారకముందే బయలుదేరి రైలెక్కాడు. రైలు వేగాన్ని అధిగమించి అతని మనస్సు కనకాంబ దగ్గిరకు పరుగు తీస్తోంది.

ఆ రోజు సాయంత్రానికల్లా చలపతిరావు గమ్యస్థానం చేరాడు.

ఎక్కువ శ్రమలేకుండానే, ఆ పల్లెటూళ్లో వాళ్ల యిల్లు తెలుసుకున్నాడు.

కనకాంబ తండ్రీ వాళ్లు బాగా వున్న కుటుంబీకులు, ఆ వూళ్ళోని పెద్ద రైతుల్లో ఒకరు.

వాకిట్లో అతన్ని చూస్తూనే కనకాంబ తండ్రి ఆదోలా మొహం చిట్లించి - నవ్వాడు.

తన రాక అతడికేమీ ఆశ్చర్యాన్ని కలిగించలేదని చలపతిరావు గ్రహించాడు.

"నాలుగేళ్లకే ఎంత మారిపోయావోయ్! యింటి దగ్గిర అంతా కులాసాఏనా?"

చలపతిరావు తల వూపాడు.

అతడి దృష్టీ, హృదయం, వారగా వేసివున్న యింటి తలుపుల వెనక భాగాన్ని వెతుకుతున్నయ్.

కాళ్లూ చేతులూ కడుక్కున్న తరవాత, కనకాంబ తండ్రి కుర్చీ చూపిస్తూ, "కూర్చో! అమ్మాయి పక్కింటి కెళ్లింది - పిలుచుకొస్తా" అంటూ బయటికి వెళ్లాడు.

చలపతిరావు కుర్చీలో కూర్చుని, యింటి నలుమూలల్ని పరిశీలనగా చూశాడు.

యింటి అలంకరణా, వున్న వస్తుసామాగ్రినీ పట్టిచూస్తే, తమకన్న బాగావున్న వాళ్లుగానే

అతనికి తోచింది.

"ఎంతసేపైంది వచ్చి?"

చలపతిరావు చూస్తున్న వైపు నుంచి ప్రశ్న వచ్చిన దిక్కుకు తల తిప్పాడు.

పదహారు పదిహేడేళ్ల నిండు జవ్వని! గుర్తించాడు – కనకాంబ!

అతడి నాలుక మొద్దుబారి పోయింది. గొంతులో ఎన్నో ప్రశ్నలూ, జవాబులూ కొట్టుమిట్టాడినై. ఆమె అందం, నునుసిగ్గుతో పమిట చెంగును వేలికి చుట్టుకుంటూ నిలుచున్న భంగిమా – అతణ్ని మంత్రముగ్ధుణ్ని చేసినై.

"ఐదారు నెల్లనాడు రాసిన నా వుత్తరానికి జవాబే లేదు – అందుకే విసుగుపుట్టి, ఆఖరు వుత్తరంగా – అంత సూటిగా రాసేశాను"

చలపతిరావు కొంత తెప్పరిల్లాడు. ఆమె మాటలు కొంత వింతగా తోచినయ్.

"ఐదారు నెల్లనాడు వుత్తరం రాశావా?"

"రాశాను. చేరలేదా?"

కనకాంబలో సిగ్గూ, దాని ఛాయలు కూడా తొలిగిపోయినై. కొంత ఆశ్చర్యం కలిసిన అనుమానంతో, చలపతిరావు మొహంలోకి చూసింది.

"నువ్వు రాసిన వుత్తరమంటూ నాకు చేరింది ఒకే ఒకటి – అది కూడా నిన్ననే..."

"ఆఁ!" – కనకాంబ పులిని చూసిన దానిలా కంపించి, నిలువు గుడ్లతో పక్కన వున్న గోడకు నిర్జీవిలా చేరగిలపడింది.

"నువ్వు ఏ చలపతిరావూ....?" – ఆమెలో ప్రశ్నించగల శక్తీ, ధైర్యం కూడా నశించి పోతోంది.

చలపతిరావు ఆశ్చర్యంతో స్తంభించి పోయాడు. అంతలోనే తేరుకుని, కనకాంబ అడిగిన ప్రశ్నలోని అనుమానాన్నీ, సంశయాన్నీ గ్రహించాడు.

ఆ వుత్తరం చదివాక, ఆ కిందటి రోజు తనలో నీడల్లా కదిలిన అన్ని భావాలూ అతని మనో నేత్రం ముందు మెరిసినై. కోడెగిత్తా, కోర్కె వుండీ సాహసించలేక బాధపడే ఆవు పెయ్యా – అప్పుడు తనలో నుంచి వెలువడిన భావాలూ – 'దేనికైనా మగజీవే సాహసించాలి, ఆడప్రాణి దంతా...' – ఆ మాటలు నిశ్శబ్దంగా అతడి హృదయానికి గిలిగింతలు పెట్టినై.

చలపతిరావు కుర్చీలో నుంచి లేచాడు.

కనకాంబ వైపుకు ఒక్కొక్క అడుగేవేస్తూ, "ఏ చలపతిరావనుకున్నావ్? ఏ చలపతిరావైతే మాత్రం...."

మాట, మధ్యలోనే ఆగిపోయింది – కాళ్లూ అక్కడే భూమికి బరువుగా అంటుకు పోయినై.

కనకాంబ తండ్రి పెద్దగా చప్పుడు చేస్తూ, ద్వారబంధం దాటి యింట్లోకి వస్తూ అంటున్నాడు.

"మీ తమ్ముడు చలపతిరావు ఎలా వున్నాడోయ్?"

❋

*(అభిసారిక మాసపత్రిక : మార్చి, 1951)*